## క్లుప్తంగా

### పోలియో అవగాహన ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలా అకాడమీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సంజీవనగర్ మీదుగా శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. బాలా అకాడమీ పాఠశాల ఫౌండర్ కొండయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, మాజీ గవర్నర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ పోలియో వైరస్ చిన్న తనంలోనే శరీరంలోకి ప్రవేశించి శాశ్వత వికలాంగులుగా చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ మాధవీలత, మాలేపాటి రాజశేఖర్, కైలాసనాథరెడ్డి, ప్రసాదరెడ్డి, నాగరాజారావు, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించిన చెస్ పోటీల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, ప్రిన్సిపాల్ రమ్యారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. లక్ష్మిచైతన్యరెడ్డి, సంతోష్, పవన్, వరుణ్, ఓబులేసు, హరీఫ్, హుసేన్, విష్ణు, భరత్, జయకృష్ణ, విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

### నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఉయ్యాలవాడలో చేతి బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోనున్న చేతి బోరును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ, సర్పంచ్ మేకల ఓబులేసు, మండల కోఆర్డినేటర్ రమణారెడ్డి పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ మండలంలో 61 చేతి బోర్లు ఉన్నాయని, వాటన్నిటిని పరిశీలించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామని చెప్పారు.

### జిల్లా వ్యవసాయాధికారి ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ

బండి ఆత్మకూరు: మండలంలో యూరియా కొరత ఉన్న నేపథ్యంలో ఏ.కోడూరు గ్రామ పీఏసీఎస్‌ని సోమవారం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా యూరియా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ లను పరిశీలించారు. రైతులకు వారు సాగుచేసిన పొలానికి అనుగుణంగా యూరియా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ స్వాతితో పాటు రైతులు పాల్గొన్నారు.

### మల్లన్న సేవలో మంత్రులు

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను సోమవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారి వెంట శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. ప్రధాన ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి ఆహ్వానం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అర్చకులు వేదాశీర్వాదాలు అందించగా, ఈఓ శ్రీనివాసరావు వారికి స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించొద్దు

మహానంది: మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మహానందిలో జరుగుతున్న విద్యుత్ పనులను సోమవారం ఆయన పరిశీలించి ఏఈఈ ప్రభాకర్‌రెడ్డితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలన్నారు.

# హాట్సాఫ్





అహోబిలం రోడ్డులో కోతులకు అరటి పండ్లను అందిస్తున్న మల్లికార్జున,జనార్దన్

- నల్లమలలో కోతులకు ఆహారం మృగ్యం
- వానరాలకు ఆహారం అందిస్తున్న ఇద్దరు వ్యవసాయ కూలీలు
- రెండేళ్లుగా నిత్య ప్రక్రియగా మార్చుకున్న వైనం
- అహోబిలం వెళ్లే దారిలో ఆకలితో కోతుల ఇక్కట్లు

రుద్రవరం: ఆకలేస్తుందంటే పట్టెడన్నం పెట్టని కాలమిది. అలాంటిది ఓ ఇద్దరు వ్యక్తులు రెండేళ్లుగా అడవిలో ఆకలితో అలమటిస్తున్న వానరాలకు ఆహారం అందిస్తూ గొప్ప మనస్సును చాటుకుంటున్నారు. వానరాలకు నల్లమలలో ఆహారం కరువైంది. దీంతో అహోబిలం వెళ్లే రోడ్డు సమీపంలో సంచరిస్తూ వాహనదారులు, క్షేత్రానికి వెళ్లే భక్తులు అందించే పండ్లు తింటూ గడుపుతున్నాయి. ఆలూమూరు గ్రామానికి చెందిన జనార్దన్, మల్లికార్జున అనే ఇద్దరు వ్యవసాయ కూలీలు వ్యక్తిగత పనుల నిమిత్తం ఆ దారిలో వెళ్లారు. ఈ క్రమంలో ఆకలితో అలమటిస్తున్న కోతులను చూసి చలించిపోయారు. సంపాదించిన సొమ్ములో కొంత వాటి ఆహారానికి ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నారు. పనుల్లో భాగంగా అరటి కోతలకు వెళ్లినప్పుడు, తోటలు పూర్తయినప్పుడు మిగిలిపోయిన అరటి గెలలను ఇంటికి తీసుకెళ్లి వాటిని మాగబెడతారు. మాగిన వాటిని ఓ సంచిలో వేసుకొని మోటార్ సైకిల్‌పై నర్సాపురం నుంచి అహోబిలం రోడ్డులో ఎక్కడ వానరాలు కనిపిస్తే అక్కడ వాటికి అరటి పండ్లను అందజేయడం ప్రారంభించారు. అలా రెండేళ్లుగా వారు ఈ ప్రక్రియను నిత్యజీవితంలో భాగంగా మార్చుకున్నారు. ఇక అరటి పళ్ల సీజన్ లేనప్పుడు తక్కువ ధరకు లభించే పండ్లను కొనుగోలు చేసి వాటికి ఆహారంగా అందజేస్తున్నారు.

# విద్యుత్ శాఖ పదోన్నతుల్లో గందరగోళం

- జూనియర్లకు ప్రమోషన్.. సీనియర్ల కు డిమోషన్
- ఇచ్చిన ప్రమోషన్లను సైతం రద్దు చేసి డిమోషన్ ఇస్తున్నారని ఆందోళన



న్యాయం చేయాలని ఉన్నతాధికారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

ఆళ్లగడ్డ: సాధారణంగా ఏ ప్రభుత్వ విభాగంలో అయినా సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తుంటారు. విద్యుత్ శాఖలో మాత్రం విచిత్ర తంతు సాగుతోంది. సుమారు నాలుగు సంవత్సరాలు ఆలస్యంగా ఉద్యోగంలో చేరిన జూనియర్‌లకు ప్రమోషన్లు ఇవ్వడం ఒక ఎత్తైతే.. ఇప్పటికే ప్రమోషన్ పొందిన సీనియర్లను డిమోషన్ చేస్తుండటంతో 2007 బ్యాచ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

**2006లో నియామకం..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏపీసీపీడీసీఎల్ 2006 జూన్7న ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు ఎంపికైన ఉద్యోగులు 2007లో కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగంలో చేరారు. 2 సంవత్సరాల అనంతరం వీరిని రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చారు. అయితే 2006 అక్టోబర్ 20న రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేయగా సాంకేతిక కారణాలతో రద్దయ్యింది. అయితే ఈ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 2011లో నేరుగా రెగ్యులర్ ఉద్యోగులుగా విధుల్లో చేరారు. ఇప్పుడు 2007, 2011 బ్యాచ్‌లకి సంబంధించిన వారిని కలిపి 17 సంవత్సరాల అనంతరం సీనియార్టీ జాబితా తయారు చేస్తున్నారని దీంతో వారికంటే నాలుగు సంవత్సరాల క్రితం ఉద్యోగంలో చేరిన తమకు అన్యాయం జరగడంతో పాటు ఇప్పటికే ప్రమోషన్‌లు పొందిన అనేక మంది డిమోషన్ కావలసి వస్తుందని 2007 బ్యాచ్ విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం





పూజలందుకుంటున్న బసవేశ్వరస్వామి హోమం చేస్తున్న భక్తులు

శిరివెళ్ల: స్థానిక శ్రీ బసవేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. నంద్యాలకు చెందిన బసవేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు ఆగమ శాస్త్ర సలహాదారుడు శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి వినాయక, అన్నపూర్ణ విశాలక్ష్మి, కాశీ విశ్వేశ్వర, బసవేశ్వర, కుమార స్వామి, వీరభద్రస్వామి, కాలభైరవ స్వాముల వారికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం భక్తులతో హోమం జరిపించారు. శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేశారు.

## ఆలయంలో హుండీ చోరీ

- రుద్రవరం మండలంలో వరుస దొంగతనాలు



గ్రామ పెద్దలతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ

రుద్రవరం: మండలంలోని నర్సాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున హుండీ చోరీ అయ్యింది. గ్రామస్తులు తెలిపిన వివ రాల మేరకు.. దిన చర్యలో భాగంగా నరసింహస్వామి మాలధారులు ఆదివారం రాత్రి పూజలు ముగించి తాళాలు వేసి వెళ్లారని సోమవారం తెల్లవారు జామున మాళాధారులు వెళ్లే సరికి తలుపులు తెరిచి ఉడంటంతో లోపలికి వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు. వెంటనే వారు పూజారి, గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. వారంతా అక్కడికి చేరుకొని ఎస్ఐ వరప్రసాదు విషయం తెలియజేశారు. ఆయన సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. ఏటా నరసింహస్వామి జయంత్సువం పూర్తి కాగానే హుండీని లెక్కిస్తామని, దాదాపు రూ.50వేల నుంచి రూ.80వేల వరకు కానుకలు లభించేవని గ్రామ పెద్దలు తెలిపారు. మండలంలో ఇప్పటికే మూడు ఆలయాల్లో హుండీలు చోరీకి గురయ్యాయని చెప్పారు. ఇటీవల కోటకొండ, ఆర్.నాగులవరం అమ్మవార్ల ఆలయాల్లో హుండీ ఎత్తుకెళ్లారి వివరించారు.

## శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం పరిశీలించారు. ఉచిత, ప్రత్యేక, అతి శీఘ్రదర్శన, శివదీక్షా భక్తుల ప్రత్యేక క్యూలు పరిశీలించారు. ఉచిత ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఎక్కడ నుంచి ప్రారంభం అవుతాయి, దర్శనానికి వారికి ఎంత సమయం పడుతుంది, క్యూ లైన్‌లో ఉన్నవారికి టాయిలెట్ సౌకర్యం ఉందా। తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్‌లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనాయక్, ఈఓ. శ్రీనివాసరావు, సీఎఫ్ఓ చంద్రశేఖర్ ఆజాద్, సీఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

**27న బుగ్గ రామేశ్వరుని కల్యాణం**

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల సమీపంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశిరాత్రి వేడుకల సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు లఘ్న పత్రికను సోమవారం రూపొందించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో అర్చకులు చంద్రశేఖరశర్మ లఘ్న పత్రికను లిఖించి స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓకు సమర్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల వివరాలను ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 25న సాయంత్రం కన్నమడకల నుంచి ఉత్సవమూర్తులు బుగ్గ క్షేత్రానికి వరప్రయాణం చేస్తారు. 26న ఉదయం స్వాముల వారికి అభిషేకాది పూజలు, కొచ్చెరువుపల్లె వారిచే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జీవిత చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన, 27న స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు



ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

నందికొట్కూరు: పట్టణ శివారులోని పగిడ్యాల–కొణిదెల క్రాస్ రోడ్డు వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాజాభజంత్రీల మధ్య ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించే ప్రాంతంలో పురోహితులు ప్రాణప్రతిష్ఠ పూజలు చేశారు. వేద మంత్రాలు, భక్తుల శ్రీఆంజనేయ నామస్మరణ నడుమ ఆంజనేయస్వామి విగ్రహాన్ని క్రేన్ సాయంతో ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల జిల్లా నాయకుడు గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీలో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

మహానంది: మహానందిలో వెలిసిన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు శరభయ్యశర్మలు ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువు తీర్చి ఆలయ ప్రాకారంలో ఉత్సవాన్ని చేపట్టారు.

# నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



ఆలమూరులో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

రుద్రవరం: నులిపురగుల నివారణతో బాల బాలికల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నంద్యాల ప్రోగ్రాం వైద్యాధికారి అంకిరెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలోని బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇది పరీక్షల సమయమని ఆరోగ్యంగా ఉంటూ మంచిగా చదవాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో 3,295 మంది ఉండగా వారిలో 3,213 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు వైద్యులు అమర్‌నాథ్‌రెడ్డి,గాయిత్రి తెలిపారు.అలాగే రుద్రవరం పీహెచ్‌సీ పరిధిలో మాత్రలు వేసినట్లు వైద్యాధికారిని శ్రావణి తెలిపారు.

- **ఉయ్యాలవాడ:** రక్త హీనత, అనారోగ్యాన్ని కలిగించే నులి పురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నిర్మూలించడంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి రాబర్ట్ కెనడీ తెలిపారు. సోమవారం ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విద్యార్థులకు మాత్రలు వేశారు. 2280 మంది విద్యార్థులకు గాను 1,824 మందికి మాత్రలను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి, కృష్ణ ఉన్నారు.
- **శిరివెళ్ల:** నులి పురుగుల నివారణే లక్ష్యమని నులి పురుగుల నివారణ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో జరిగిన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్యక్రమ అమలుపై డాక్టర్ దివ్య, సిబ్బందితో సమీక్ష చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గల 4,913 మంది పిల్లలకు గాను 4,633 మందికి నులి పురుగు నివారణ మందులను వేశామని డాక్టర్ తెలిపారు.ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
- **నంద్యాల(న్యూటౌన్):**పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామలింగారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.
- **గోస్పాడు:** మండలంలో 96 శాతం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు ఆయా పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు గోపాల్, వెంకటేశ్వర్లు, గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గోస్పాడులో 3,822 మందికి గాను 3,767 మందికి, జిల్లెల్ల పీహెచ్‌సీ కేంద్రం పరిధిలో 2,175కిగాను 2,052 మందికి, దీబగుంట్ల ఆరోగ్య కేంద్రం పరిధిలో 1,917 మందికి వేయాల్సి ఉండగా 1.836 మందికి వేసినట్లు వివరించారు.



కార్యక్రమంపై వైద్యులతో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి

- **నంద్యాల(అర్బన్):** 19ఏళ్లలోపు వయస్సు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యుడు షహలాం తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాసులు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అన్నమ్మ, నాగమణి పాల్గొన్నారు.

## 14న సంజామలలో జాబ్ మేళా

సంజామల: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని యువకులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9705998056 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## నేటి నుంచి బోనాల పండుగ

నంద్యాల(అర్బన్): స్థానిక బైటిపేటలో వెలసిన శ్రీ జంబులాపరమేశ్వరి (జంబులమ్మ) బోనాల పండుగ మహోత్సవం మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత అధ్యక్షురాలు గాండ్ల రాజేశ్వరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న అమ్మవారికి క్షీరాభిషేకం, చండీ హోమాలు ఉంటాయని, 12న బోనాల పండుగ నుంటుందని పేర్కొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్ఓ రామునాయక్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని డీఆర్ఓ రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా చదివి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్జీదారునికి సరైన ఎండార్స్‌మెంట్ ఇస్తూ రసీదు పొందాలన్నారు. ఫిర్యాదులు రీఓపెన్ కావడానికి గల కారణాలకు సంబంధించి దాదాపు పది అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. బీయాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న అర్జీలపై తక్షణమే స్పందించి క్లియర్ చేయాలన్నారు. 117 మంది అర్జీదారులు వినతులు ఇచ్చారని, వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆల్ ఇన్‌వన్ ఉచిత పుస్తకాల పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు జీవలత అధ్యక్షత డీడీ సోషల్ వెల్ఫేర్ సంస్థ లక్ష్మినాయక్ ఒంగోలు వారి సౌజన్యంతో పుస్తకాలు అందజేశామన్నారు. దొరస్వామి, జీవన్, సాల్మోన్, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

## యుద్ధ గర్జనకు తరలిరండి

ఉయ్యాలవాడ : ఈ నెల 23వ తేదీన కర్నూలులో జరిగే మాలల యుద్ధ గర్జన కార్యక్రమానికి మాలలు భారీ సంఖ్యలో తరలి రావాలని నంద్యాల జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షుడు కోగిల ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో కరపత్రాలను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించేందుకు పోరాటాన్ని ఉధృతం చేస్తున్నట్లు చెప్పారు.

## భోగేశ్వరుడి సన్నిధిలో ఏఎస్పీ

గడివేముల: మండల పరిధిలోని దుర్గా భోగేశ్వర స్వామి సన్నిధిలో నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ సోమవారం పూజలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి భోగేశ్వరుడి దర్శనార్థం వచ్చారు. స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక మండపంలో వారికి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

## ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.